క్లుప్తంగా

యువజన విభాగం అధ్యక్షుల నియామకం

బి.కొత్తకోట : వైఎస్సార్‌సీపీ మండల యువ జన విభాగం అధ్యక్షులను నియమిస్తూ శని వారం పార్టీ కేంద్ర కమిటీ ప్రకటన జారీ చేసింది. తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దమండ్యం మండల అధ్యక్షునిగా ఎం.శ్రీనివాసులురెడ్డి, తంబళ్లపల్లె మండల అధ్యక్షునిగా ఆర్.రాజశేఖ ర్‌రెడ్డి నియమితులయ్యారు.

తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : మార్గశిర పౌర్ణమి పురస్కరించుకుని తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు నడ పనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. 26న ఉదయం 9 గంటలకు బస్సులు బయలుదేరుతాయన్నారు. అల్ట్రా డీలక్స్ బస్సులకు రాను, పోను రూ.805, ఎక్స్‌ప్రెస్‌కు రూ.670 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9959225676, 7382875034ను సంప్రదించాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వాల్మీకిపురం : మండలంలోని అయ్యవారిపల్లి, బూడిదవేడు పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం ఆయా పంచాయతీల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పులి నరేంద్ర కుమార్ రెడ్డి, వెలుగు ఏపీఎం నరసింహులు, విద్యుత్‌శాఖ ఏఈ జాకీర్, సర్పంచ్ జయచంద్ర, నాయకులు వెంకటరమణ, వెంకట్రాది, వైద్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంగీత మహోత్సవాన్ని జయప్రదం చేయండి

పీలేరు రూరల్ : జనవరి 6, 7వ తేదీలలో తిరుపతిలో నిర్వహించనున్న త్యాగరాజస్వామి సంగీత మహోత్సవం జయప్రదం చేయాలని వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం నాయకులు రుద్రకోటి సదాశివం, యర్రయ్య కోరారు. శనివారం స్థానిక కాశీవిశ్వేశ్వర పార్క్‌లో త్యాగరాజస్వామి సంగీత మహోత్సవ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతిలో రెండు రోజుల పాటు త్యాగరాజస్వామి ఊరేగింపు, అనంతరం కచేరీలో ఉంటాయని తెలిపారు. వాయిద్య కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వై. మునిరామయ్య, రమేష్, సురేంద్ర, బాలయ్య, యల్లయ్య, రాధ, రెడ్డెప్ప, ఆనంద, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు మద్దతు

కురబలకోట : వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు కట్టెపోగు బసవరావు చేపట్టిన పాదయాత్ర శనివారం కురబలకోట మండలం ద్వారా సాగింది. జిల్లా నాయకులు ముద్ర దామోదర్ రెడ్డి, అర్జున్ రెడ్డి మద్దతు తెలుపుతూ వారికి స్వాగతం పలికారు. రానున్న ఎన్నికల్లో 175కు 175 స్థానాలు రావాలని కోరుతూ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా బసవరావు మాట్లాడుతూ రానున్న ఫిబ్రవరి నెలాఖరుకు ఈ పాదయాత్ర పూర్తి అవుతుందన్నారు. అన్ని నియోజక వర్గాల్లో సీఎం జగన్‌కు చెక్కు చెదరని అభిమానం కన్పిస్తోందన్నారు.

నేడు వెలిగల్లులో గడప గడపకు మన ప్రభుత్వం

పెద్దమండ్యం : మండలంలోని వెలిగల్లు గ్రామ పంచాయతీలోని పల్లెలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ పూర్ణచంద్రిక, మండల కన్వీనర్ చాంద్ బాషా తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తాని తెలిపారు.

ఉచిత ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కలకడ : విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆదర్శ పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు కెఎస్ మస్తాన్, కోన క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు చెంగల్‌రాయులు అన్నారు. శనివారం ఆయా పాఠశాలల్లో ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను విద్యార్థులకు అందజేశారు. 10తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధపెట్టి వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. పరీక్షల సమయంలో టీవీలకు, సెల్‌ఫోన్‌లకు విద్యార్థులను దూరంగా ఉంచి, బోధనలో మెలకువలు నేర్పి మంచి మార్కులు సాధించడానికి సమిష్టిగా కృషి చేయాలని కోరారు.

వైకుంఠవాసా.. గోవిందా

- గోవింద నామస్మరణలతో మార్మోగిన వైష్ణవాలయాలు
- ప్రత్యేక అలంకరణలతో శోభాయమానం



మదనపల్లె : శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరుడు



స్వామి వారి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు



మదనపల్లె : ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన శ్రీ వెంకటేశ్వరస్వామి



వాల్మీకిపురం : విశేష అలంకరణలో ఓబులేశ్వర స్వామి



రామసముద్రం : ప్రత్యేక అలంకారంలో శ్రీలక్ష్మీజనార్దనస్వామి



కలికిరి: భక్తులకు దర్శనమిస్తున్న వెంకటేశ్వరస్వామి

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు శనివారం కనులపండువగా జరిగాయి. వైష్ణవ ఆలయాలన్నీ గోవింద నామస్మరణలతో మార్మోగాయి. పర్వదినాన్ని పురస్కరించుకుని పలు ఆలయాల్లో భక్తులు వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. వేకువజామునుంచే ఆలయాల్లో వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మదనపల్లె పట్టణంలోని దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో స్వామి వార్ల మూలవిరాట్‌లకు వేదపండితులు లక్ష్మణ,బాలాజీస్వాములు మహా క్షీరాభిషేకం ప్రత్యేక పూజలు, ఉపనిషత్తుల, పూర్వక మంత్రాల అనంతరం వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య మంగళవాయిద్యాల తో ఉత్తర ద్వారం వద్ద అప్పటికే సర్వాంగ సుందరంగా అలంకరించిన పుష్పవేదికపై ఉత్సవ మూర్తులను ఆశీనులు గావించారు. ఉదయం 3 నుంచి వైకుంఠ ద్వార దర్శనం పూజలు నిర్వహించి ద్వారాన్ని తెరిచారు.మొదట గోవును ద్వారం ద్వారా పంపిన తరువాత భక్తులకు దర్శనంకు పంపారు. స్వామివారి దర్శనానికి వేచి యున్న భక్తులు గోవింద నామస్మరణతో ఉత్తర ద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశిస్తూ పునీతులయ్యారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశారు. ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు వలంటీర్ల సేవలు అందించారు. ఆలయ ఈఓ రమణ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బింగిపాండు పర్యవేక్షించారు. వాసవీభవన్‌వీధిలోని శ్రీవాసవీ కన్యాకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని వెంకటేశ్వరస్వామి అలంకారం చేశారు. ఉత్తర ద్వారం ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయస్వామిని వేరుశనగ కాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శనం కల్పించారు. శ్రీవారినగర్‌లోని శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయం, బర్మావీధిలోని సాయిబాబా ఆలయం, అనపగుట్టలోని గోవర్ధనగిరిలోని శ్రీకృష్ణ ఆలయం, బసినికొండలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు నిర్వహించారు.

పీలేరు : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మండలంలో పలు ఆలయాలు భక్తులతో గోవిందనామ స్మరణతో మార్మోగాయి. శనివారం తెల్లవారిజామున 5 గంటల నుంచి కోటపల్లెలోని శ్రీ పద్మావతి ఆండాల్ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు వైకుంఠద్వార దర్శనం కల్పించారు. అలాగే స్థానిక కడప మార్గంలోని వెంకటాద్రిళ్ల సమీపంలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, మండలంలోని అగ్రహారం లక్ష్మీనరసింహస్వామి ఆలయం, స్థానిక మదనపల్లె మార్గంలోని చెన్నకేశవస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోటపల్లె ఆలయంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, కడప మార్గంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, అన్నపూర్ణ క్యాటరింగ్ అధినేత చలపతి, సభ్యులు గంగిరెడ్డి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

గుర్రంకొండ : మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం పండుగ సందర్భంగా ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. తరిగొండలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో ఉత్తర ద్వారం వైపు స్వామి వారిని కొలువుదీర్చారు. భక్తుల క్యూ కూడా ఆలయానికి దక్షిణంవైపు నుంచి ఉత్తరద్వారం వైపు భక్తులు ఆలయంలో ప్రవేశించేటట్లుగా అధికారులు ఏర్పాట్లు చేశారు. గోవిందా గోవిందా అంటూ భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామి వారికి ఘనంగా పూజలు నిర్వహించారు. తరిగొండలో లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గుర్రంకొండలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని భక్తులు దర్శించుకొన్నారు.

వైభవంగా ఏకాదశి పూజలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం జరిగిన వైకుంఠ ఏకాదశి పూజలు కన్నుల పండుగగా నిర్వహించారు. ఉదయం నాలుగు గంటల నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవత ద్వారంగా పేర్కొనే వైకుంఠ ద్వారం ద్వారా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. దేవతా ప్రతిమలకు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించారు.

శ్రీలక్ష్మిజనార్ధనస్వామి ఆలయంలో..

రామసముద్రం : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీజనార్ధనస్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. ఆలయ అర్చకులు కులశేఖర్‌బట్టర్ భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి ఆలయం వద్ద చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే మినికిలోని కళ్యాణ వెంకటరమణ స్వామి , వనగానిపల్లెలోని శ్రీవెంకటేశ్వరస్వామి, చెంబకూరులోని శ్రీగట్టు వెంకటరమణస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించి, భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

కలకడ : మండలంలోని వివిధ ఆలయాల్లో భక్తులు ముక్కోటి ఏకాదశి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురంలో వెలసిన శ్రీసాయి సన్నిధిలో అభిషేకం, అన్నదానం, పల్లకీ సేవ నిర్వహించారు. మండలంలోని కలకడ శ్రీసిద్దేశ్వరస్వామి ఆలయంలో, కోన గుడిబండ, కలకడ, కె.బాటవారిపల్లె, కదిరాయచెర్వు గ్రామాలలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి ఆలయాలలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

కలికిరి : వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, చిక్కిరవాండ్లపల్లిలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, గుండ్లూరులో వెలసిన చెన్నకేశవస్వామి ఆలయం, రంగనాధపురంలోని రామాలయం, పలు గ్రామాల్లో వెలసిన రామాలయాల్లోనూ నిర్వాహకులు వైకుంఠద్వార దర్శనం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాల వినియోగం చేశారు.

వైభవంగా ఓబులేశ్వర స్వామికి పూజలు

వాల్మీకిపురం : వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని చింతపర్తి సమీపంలోని ఓబులేశ్వర స్వామి కొండపై స్వామి వారికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అర్చన, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి, వైకుంఠ ద్వారం ద్వారా భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే కొండపై వెలసిన నరసింహస్వామి, సంతాన వేణుగోపాలస్వామి వార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, చింతపర్తి గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా గీతాపారాయణం

గుర్రంకొండ : మండల కేంద్రంలో గీతా పారాయణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శనివారం వైకుఠ ఏకాదశిని పురస్కరించుకొని స్థానిక ఇందిరమ్మ కాలనీలోని శ్రీ కృష్ణమందిరంలో గీతా పారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భగవద్గీతలో మొత్తం 18 అధ్యాయాలను ఉదయం నుంచి సాయంకాలం వరకు ఆలపించారు. గీతాపారాయణం ముగిసిన అనంతరం ఆలయంలో భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ములకలచెరువు: మండలంలోని శ్రీకనకొండరాయ స్వామి ఆలయం, బురకాయలకోట శ్రీలక్ష్మిప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.



గుర్రంకొండ : గీతాపారాయణం కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు



పీలేరు : కోటపల్లెలో భక్తులకు దర్శనమిస్తున్న వెంకటేశ్వరస్వామి



ములకలచెరువు : లక్ష్మి ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు



కలకడ : పల్లకీలో సాయినాథుడి ఊరేగింపు

'ఆడుదాం ఆంధ్ర' పోటీలను విజయవంతం చేయాలి

- ఆర్డీఓ ఎం.ఎస్.మురళి
- అవగాహనలో భాగంగా పట్టణంలో 3కే రన్



పట్టణంలో 3కే రన్ నిర్వహిస్తున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి, అధికారులు

మదనపల్లె : రాష్ట్రస్థాయిలో జరుగుతున్న మొదటి స్పోర్ట్స్ టోర్నమెంట్ ఆడుదాం ఆంధ్ర పోటీలను విజయవంతం చేయాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి పిలుపునిచ్చారు. శనివారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అవగాహనలో భాగంగా పట్టణంలో 3కే రన్ ర్యాలీ నిర్వహించారు. సబ్ కలెక్టరేట్‌లో ర్యాలీని జెండాఊపి ప్రారంభించారు. అనంతరం జెడ్పీ హైస్కూల్ మైదానంలో ట్రయల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడావ్యవస్థను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రభుత్వం డిసెంబర్ 26 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. గ్రామ సచివాలయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు వివిధ క్రీడా విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులకు బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 26 నుంచి కార్యక్రమం మొదలై...47 రోజుల పాటు ఫిబ్రవరి 10 వరకు సచివాలయం, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు కార్యక్రమం వివిధ దశల్లో జరుగుతుందన్నారు. ఇప్పటికే సచివాలయాల్లో వీటికి సంబంధించి క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని, పోటీలకు క్రీడామైదానాల ఎంపికతో పాటుగా అన్ని ఏర్పాట్లు శరవేగంగా చేస్తున్నామన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ లక్ష్మీపతి, తహసీల్దార్‌లు మహబూబ్‌చాంద్, రఫీక్‌అహ్మద్, ఎంపీడీఓ భాను ప్రసాద్, మున్సిపల్ ఆర్వో నాగేశ్వరరావు, సర్వేయర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' జయప్రదం చేయండి

పీలేరు : ఆడుదాం ఆంధ్ర క్రీడల కార్యక్రమం జయప్రదం చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. శనివారం స్థానిక మెయిన్ స్కూల్ విద్యార్థులతో ఆడుదాం ఆంధ్ర క్రీడలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడల విజయవంతానికి సమష్టి కృషి అవసరమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డాక్టర్ మురళీ మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

బి.కొత్తకోట : మండలంలోని బీరంగిలో శనివారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. భక్తుల కోటాలం, భజనల మధ్య ప్రత్యేక పూజలు, కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఘనంగా అయ్యప్ప రథోత్సవం

కురబలకోట : మండలంలోని అంగళ్లులో శనివారం అయ్యప్పస్వామి రథోత్సవం కోలాహలంగా సాగింది. మల్లేల గడ్డ ఆలయం నుంచి ఊరేగింపుగా పిల్లన గ్రోవి, చెక్క భజనలతో పాటు ముందు దేవరెద్దు నడుస్తూ వైభవంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. హారతులు ఇచ్చారు. అయ్యప్ప మాలధారులు ఆట పాటలతో ఆకట్టుకున్నారు.

విజయంతో తిరిగి రావాలని ఆకాంక్ష



హాకీ క్రీడాకారులతో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

కలికిరి : జేఎన్టీయూ అనంతపురం యూనివర్సిటీ హాకీ జట్టు అంతర్ యూనివర్సిటీల పోటీల్లో పాల్గొని విజయంతో తిరిగి రావాలని జేఎన్టీయూ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. జేఎన్టీయూ యూనివర్సిటీ హాకీ జట్టు వారం రోజుల పాటు కలికిరి కళాశాలలో శిక్షణ పొందారు. జట్టు ఆదివారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం భారతి దాసన్ యూనివర్సిటీలో నిర్వహించే పోటీలకు శనివారం వెళ్లింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వారితో సమావేశమై పోటీలలో ఉత్తమ ప్రతిభ చాటి యూనివర్సిటీకి మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజన్, పీడీ శ్రీరామ్ పాల్గొన్నారు.

దోమల నివారణతోనే మలేరియా నివారణ

కలకడ : దోమల నివారణతోనే మలేరియా, బోదకాల నివారణ సాధ్యమని మలేరియ సబ్ యూనిట్ అధికారి ముజీబ్‌బాషా అన్నారు. శుక్రవారం రాత్రి 8గంటల నుంచి 10 గంటల వరకూ మండలంలోని కె.దొడ్డిపల్లెలో దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ మార్గలను చూపించి తెలియజేశారు. దోమతెరల వినియోగం, నీరు నిల్వ లేకుండా చేయడం, వృధా పదార్థాలకు నిప్పు అందించి అందులో దోమలు నశింపచేయడం వంటివి చేపి చూపించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, సిబ్బంది రెడ్డెమ్మ, జమీల్ అహమ్మద్, గోపిక్రిష్ణ, లక్ష్మిదేవి, రమణమ్మ, వరలక్ష్మి, పద్మావతి, అమరావతి పాల్గొన్నారు.

లక్కీడిప్ ద్వారా పారదర్శకంగా ప్లాట్ల కేటాయింపు

నేడు ఎంపీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా పట్టాలు పంపిణీ



తహసీల్దార్ ధనుంజయులు ఆధ్వర్యంలో ప్లాట్లు కేటాయింపునకు లక్కీడిప్ తీస్తున్న దృశ్యం

పీలేరు : పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో నాలుగో విడత పీలేరులో పట్టణంలో 1600 మంది లబ్ధిదారులకు లక్కీడిప్ ద్వారా పారదర్శకంగా ప్లాట్లు కేటాయించినట్లు తహసీల్దార్ ధనుంజయులు తెలిపారు. శనివారం స్థానిక ఎంఎస్‌ఆర్ కల్యాణ మండపంలో లక్కీడిప్ ద్వారా ప్లాట్లు కేటాయించడానికి 8 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక మదనపల్లె మార్గంలోని ఏపీఐఐసీ4వ లేఅవుట్‌లో ప్లాట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇది వరకే మూడో విడత ఏపీఐఐసీ లేఅవుట్‌లో 1700 మందికి లక్కీడిప్ ద్వారా ప్లాట్లు కేటాయించడం జరిగిందన్నారు. మూడో విడత, నాలుగో విడత కలిపి మొత్తం 3300 మంది లబ్ధిదారులకు ఆదివారం (నేడు) ఏపీఐఐసీ లేఅవుట్ వద్ద రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. లక్కీడిప్ ప్లాట్ల నెంబర్లు పొందిన లబ్ధిదారులు ఆదివారం పట్టాలు తీసుకోవాలని కోరారు.

వలంటీర్ల సమ్మె వదంతులను నమ్మవద్దు

మదనపల్లె : సామాజిక మాధ్యమాల్లో వారం రోజులుగా డిసెంబర్ 31 నుంచి వలంటీర్లు సమ్మెలోకి వెళుతున్నారన్న వదంతులను నమ్మవద్దని గ్రామ, వార్డు వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పూజారి ఉదయ్‌కుమార్ తెలిపారు. శనివారం గ్రామ, వార్డు వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఈ మేరకు ఒక ప్రకటనల విడుదల చేసింది. వలంటీర్ల సమస్యపై ఈనెల 21న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని అసోసియేషన్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందించామన్నారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడమే కాకుండా తప్పక న్యాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. వలంటీర్ల సమ్మె పేరుతో జరుగుతున్న అవాస్తవ ప్రచారాలను, అబద్ధాలను వలంటీర్లు ఎవరూ విశ్వసించవద్దన్నారు.

సామాజిక తనిఖీతో కూలీలకు న్యాయం

పీడీ మద్దిలేటి



సభలో మాట్లాడుతున్న పీడీ మద్దిలేటి

కలకడ : సామాజిక తనిఖీ చేపట్టడం వలన కూలీలకు పూర్తి న్యాయం జరుగుతుందని జిల్లా డ్వామా పీడీ మద్దిలేటి, ఎంపీపీ శ్రీదేవి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో చేపట్టిన మండల స్థాయి ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. గత ఏడాది ఏప్రిల్ 1వతేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకూ మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా జరిగిన 1096, ఏపీఈడబ్ల్యూడీసీలో జరిగిన–1, ఆర్‌డబ్ల్యూస్ అండ్ ఎస్ లో–1, పంచాయతీరాజ్‌లో జరిగిన 32 పనులను తనిఖీ చేసినట్లు తెలిపారు. గుడిబండ, ముడియంవారిపల్లె, నవాబుపేట, ఎనుగొండపాళ్యెం, గంగాపురం పంచాయతీల క్షేత్రసహాయకులకు రూ.6,000 అపరాధ రుసుం విధించి పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని ఏపీఓను ఆదేశించారు. రూ. 20,097 రికవరీ చేయాలన్నారు. ప్రతి గ్రామంలో కూలీలు పనికోసం వలసలు వెళ్ళకుండా మండల, పంచాయతీ, గ్రామ స్థాయిలో పనులు చూపించి అభివృద్ధిలో పాలుపంచుకునేలా ప్రభుత్వం పనులు చేపడుతుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏపీడీలు సత్యనారాయణ, రవికుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి ప్రకాష్, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ శివప్రసాద్, సింగల్ విండోఅధ్యక్షులు వెంకట్రమణరెడ్డి, మండల కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, మోహన్‌రాజ్, ఏపీఓ చెన్న కేశవులు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా టేక్ హోమ్ రేషన్ పంపిణీ

ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి



అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ పోషణ కిట్స్ అందిస్తున్న పీడీ ధనలక్ష్మి

మదనపల్లె : వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ (టీహెచ్‌ఆర్) పంపిణీ పక్కాగా జరపాలని ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి అన్నారు. శనివారం మదనపల్లె మున్సిపాలిటీలోని గాంధీపురం, గాండ్లవంక, కుమారపురం విలీన అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ సుజాతతో కలిసి పీడీ ధనలక్ష్మి తనిఖీ చేశారు. ప్రీ స్కూల్ పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరయ్యేలా చూడాలని విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణపోషణ కిట్, పాలు అన్నీ సకాలంలో అందించాలన్నారు. పంపిణీ చేసిన స్టాక్‌కు సంబంధించి ఖర్చు వివరాలు రాయాలన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 12.30 వరకు అంగన్‌వాడీ కేంద్రాలను తెరవాలని చెప్పారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ...టేక్ హోమ్ రేషన్‌లో మూడు కిలోల బియ్యం, ఒక కిలో కందిపప్పు, అరకిలో వంటనూనె, 13 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు, నెలలో మొదటి శుక్రవారం ఇవ్వడం జరుగుతుందన్నారు. మూడో శుక్రవారం మరో రెండున్నర లీటర్ల పాలు, 12 గుడ్లు, వైఎస్సార్ పోషణ కిట్‌లోని బెల్లం, వేరుశెనగ చిక్కీలు, రాగిపిండి, గోధుమపిండి, ఎండుఖర్జూరం, అటుకులు పంపిణీ చేయాలన్నారు. 6 నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులకు నెలకు 25 గుడ్లు, 5 లీటర్ల పాలు ఇస్తామన్నారు. జిల్లాలో 18,000 గర్భిణులు, బాలింతలు ఉన్నారని, వీరికి రెండోవిడత టీహెచ్‌ఆర్ 16,000 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి రెండురోజుల్లో పూర్తిచేస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న టీహెచ్‌ఆర్‌ను గర్భవతులు, బాలింతలు తీసుకునేలా సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. క్రమం తప్పకుండా పోషకాహారాన్ని అందించడం ద్వారాజిల్లాలో రక్తహీనతతో బాధపడేవారి సంఖ్య తగ్గించామన్నారు. తనిఖీల్లో భాగంగా 10 మంది గర్భవతులు, బాలింతలకు పీడీ ధనలక్ష్మి చేతుల మీదుగా వైఎస్సార్ కిట్స్‌ను పంపిణీ చేశారు.

ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



ఆలయ నిర్మాణ పనులపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : మల్లయ్య కొండపై చేపట్టిన ఆలయాల పునః నిర్మాణ పనులు నాణ్యతగా త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా మల్లయ్య కొండను సందర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ మల్ రెడ్డి , పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కొండపై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ ఖరీమ్, జేసీఎస్ కన్వీనర్ సురేష్ రెడ్డి, కళ్యాణ్ తదితరులు ఉన్నారు.